# ప్రకృతి - వికృతి

అంత ఎత్తున కొండ శిఖరాన కూర్చుని - క్రింద అందంగా ప్రవహిస్తున్న నదికేసి చూశాను. ఇక్కడి నుండి దూకి చచ్చిపోగలను. కాని క్రింద వున్నది నది అయ్యె. నా తల వెయ్యిముక్కలై నెత్తురు చిందదు. ఈ నా పాడు శరీరానికి నీటిలో యీదులాడటం వచ్చు.

సిగిరెట్టు వెలిగించి ఖాళీ పెట్టె నీళ్ళలోకి విసిరేశాను. ఇది నా జీవితంలో ఆఖరి సిగిరెట్. అనుభవిస్తున్న చివరి సంధ్య. పడమటి దిక్కున ఎర్రగా జారిపోతున్న సూర్యబింబం నన్ను చూసి నవ్వటం చివరి మాటు చావాలి. ఘోరమైన చావు చావాలి. ఇది పల్లెటూరు. ఇక్కడ రైళ్ళు లేవు. పది మైళ్ళలోగా బస్సులు లేవు.

నన్ను నిర్దయగా చంపుకుంటాను అప్పటికైనా లోకానికి బుద్ధి వస్తుంది. నాకు లోకం జాలి అక్కర్లేదు. దానికి జ్ఞానోదయం కలగటం కావాలి.

“ఓయ్ భగవంతుడా!” అనుకున్నాను. లేచి నిలబడి అటునీళ్ళు - ఇటులోయ. ధైర్యం తెచ్చుకుంటున్నాను.

ఇంతలో ఏదో అలికిడి అయింది. గాజులూ, కడియాలూ కలిసి చేసిన చప్పుడు, తల త్రిప్పి చూసేసరికి మంచి వయసులో వున్న యువతి పైకివెక్కి నా వైపుకు నిర్లక్ష్యంగా వస్తోంది.

నిస్పృహతో రాతి మీద కూలబడ్డాను. ఎవరినీ లెక్క చేయ నట్లు, విసురుగా వస్తోంది.

చివరకు పైకి చేరుకుని నా ప్రక్కన నిల్చుంది.

ఈ నిర్జన ప్రదేశంలో ఓ యువతి, నేను నా ప్రయత్నానికి ఆటంకం కలుగుతున్నందుకు, చికాకుపడుతూ విసుగ్గా చూశాను. ఆమె కూడ నా వంక చూసింది. అందులో నాకే భావం కనబడలేదు.

ఎవరి పిల్లో తెలియదు, ఇక్కడికి వంటరిగా రావల్సిన ఆవశ్యత ఏమిటో తెలియదు. అక్కడ కొత్తగా కనిపిస్తున్న నన్ను చూసి ఏమనుకుందో తెలియదు. చదువూ, సంస్కారం లేనట్లు కనబడుతూన్న ఆమె బలంగా, ఆరోగ్యంగా, మంచి యవ్వనంతో వుంది.

చూపులు త్రిప్పుకుంది మరుక్షణంలో గభాలునగాలిలో ఒక్క ఎగురు ఎగిరి నీటిలో దూకేసింది.

ఒక్క క్షణంపాటూ నాకు మతి పోయినట్లనిపించిచింది. కాని వెనువెంటనే తేరుకుని, కర్తవ్యం నిశ్చయించుకుని నేనూ నీళ్ళలోకి దూకేశాను.

బరువుకు నీళ్ళు బాధతో కుయ్యోమని అరచినట్లయింది కొన్ని గజాలదూరంలో మునుగుతూ, తేలుతూ యువతి, నీటి మీదగా ఎగబ్రాకి ఆమెను సమీపించి బుజాలు గట్టిగా పట్టుకున్నాను. ఆమె పెనుగులాడ సాగింది. ఏమిటో అరుస్తోంది కూడా నేను లెక్క చెయ్యకుండా త్రోసుకుంటూ తీరానికి వస్తున్నాను, ఆమె యీ పెనుగులాటలో ఎంతబాధ పెట్టిందీ ఒడ్డుకు చేరాక గానీ తెలియలేదు.

తడిసిన దుస్తుల్లో ఒడ్డున నిలబడి నా వంక కోపంగా చూస్తోంది. నేను ఆయాసంతో వగరుస్తూ "ఛీ. ఏం పని!" అన్నాను.

"నువ్వు చేసిన పని బాగుందా ?"

"ఏం చేశాను? మరణస్థితిలో వున్న ఓ ప్రాణిని రక్షించటం తప్పా?"

"ఎవర్ని రక్షిద్దామను కున్నావు?"

"నిన్నే, చచ్చిపోదామని దూకేశావుగా !"

ఒక్క క్షణం నా ముఖంలోకి నిదానించి చూసింది. తర్వాత విరగబడి నవ్వింది. నవ్వుతో యించుమించు క్రిందపడి దొర్లేటంత పనిచేసింది.

"ఎందుకు నవ్వుతున్నావు" అన్నాను కసిగా.

"నీ తెలివి చూసి"

నేను ఆశ్చర్యంగా "నీకు ఎలా తెలిసింది. నా తెలివి తక్కువని గురించి" అన్నాను.

"లేకపోతే లోకంలో ఎవరైనా కావాలని చచ్చిపోతారా ?" అంది.

"ఎందుకు చచ్చిపోరు వల్లమాలిన బాధలుంటే ?"

ఆమె ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసింది.

"బాధలా ? మనుషుల్ని చచ్చిపోయేటట్లు చేసే బాధలా ? అసలు బాధలు ఎందుకు వుండాలి ?"

"ఒకటా కారణం ? వేనకువేలు"

ఆమె మళ్ళీ విరగబడి నవ్వింది. "నీకున్నాయా బాధలు ?" అంది.

"అన్నీ బాధలే. అనుకున్నది చదవలేకపోయాను అనుకున్నది సాధించలేకపోయాను. నన్ను నమ్మిన వారందరికీ ఖేదం కలిగించాను. ఈర్ష్య, తీరని అశాంతి. నాలో తపన మీకేం తెలుసు? చివరకు ఆలోచించటం తప్ప యింకేమి చేయటం చేతకానివాడు చావకేంచేస్తాడు?"

"ఎందుకు నీ గొంతు వొణుకుతోంది?"

"బాధ. ఆరాటం"

"పెళ్ళయిందా?"

"అయింది. భార్య నన్ను విడిచి వెళ్ళిపోయింది."

"ఎందుకు?"

"సుఖంకోసం"

"మళ్ళా వస్తుందా?"

"వచ్చేందుకు నేను వుండనుగా"

"వుండక ఏమవుతావు?"

నేను నాలిక కొరుక్కుని "ఏదోలే" అన్నాను.

"ఓహో! చచ్చిపోతావా?" అంటూ కిలకిలమని నవ్వి కష్టంమీద ఆపుకుని "అందుకేనా కొండకొమ్మున కూర్చుని ఆలోచిస్తున్నావ్?" అంది.

నేను స్తబ్ధుగా ఊరుకున్నాను.

కొంచం ఆగి తల విదిలించి "ఏమోనబ్బా! మనుషులికి బాధలేమిటి?" అంది.

అప్పుడు నాకు జ్ఞాపకంవచ్చి "మరి నువ్వు అక్కడినుంచి ఎందుకు దూకావు?" అన్నాను.

"సరదాకి ఈతకి"

"నీకు ఈత వచ్చా?"

"ఒక్క యీతేమిటి? కత్తిసామూ, కర్రసామూ అన్నీ వచ్చు"

"ఛీ! అదేమిటి?"

"అవును. నాకు అన్నీ వచ్చు. రోజూ కొండమీద నుంచి నదిలోకి దూకి ఆడుకుంటా. పెద్ద మొగాయన.... రక్షిం చాలని వచ్చాడంట.... రక్షించాలని.... ఏం మనుషులో? ఏవో బాధలంది, చచ్చిపోతారంట. అసలు బాధలెందు కుంటయ్యి.... పిచ్చివాళ్ళు" అంటూ యిహ నా ఉనికిని గమ నించకుండా గబగబా కొండపైకి ఎక్కిపోసాగింది.

నేను నిర్ఘాంతపోయి నిల్చున్నాను. పదహారు, పదిహే డేళ్ళ కేమీ తక్కువ వుండవు. బాధలంటే తెలియవు అని మను షులని చావమని శాసిస్తాయని తెలియవు. ఎవరీ అదృష్టవంతు రాలు?

ఆమె కొండపైకి ఎక్కుతూండటం కాసేపు గమనించి, ఓ నిట్టూర్పు విడిచి తిరుగుముఖం పట్టాను.

కనుచీకటి పడుతూండేసరికి స్నేహితుని యింటికి చేరాను. అతను లోపలినుంచి దీపం పట్టుకొచ్చి నేలమీద పెడుతూ "ఎంత దూరంపోయి వచ్చావ్?" అన్నాడు.

నా ప్రయత్నం, ఆలోచన కప్పిపుచ్చి - ఆమె గురించిన మిగతా విషయమంతా వివరించి ఎవరిని అడిగాను.

"అదా? దాన్ని చండి అంటారు"

"అదేం పేరు?"

"దానికా పేరే యిష్టం. వాళ్ళ నాన్న పెద్ద వస్తాద్. కూతురికి చిన్నప్పటినుంచీ సాము గరిడీలు నేర్పించాడు. రోజూ నదిలోపడి యీదులాడుతూంటుంది"

"పెళ్ళయిందా ?"

"లేదు. ఏం.... చేసుకుంటావా ?" అని తన చమత్కారానికి విరగబడి నవ్వాడు.

నా మనసంతా విపరీతమైన ఆలోచనలతో నిండిపోయింది. ఇటువంటి సుఖజీవులున్న భూమిమీద నివసిస్తూ నేనెందుకు చావును కోరుకోవాలి ? ఎందుకు వ్యథిత హృదయుడ్ని కావాలి ? ఎక్కడో మూర్ఖాతి మూర్ఖుడ్నిలా వున్నాను. కష్టాలని పటాపంచలు చేసి జీవిత పరమావధిని సాధిస్తాను. నేనూ మనిషినని ఋజువు చేసుకుంటాను.

కొండపైకి గబగబా ఎక్కిపోయే ఆ సంతోషకరమైన జీవే నా కళ్ళముందు నడయాడసాగింది.

ముఖం ప్రక్కకి త్రిప్పుకుని కళ్ళు తుడుచుకున్నాను.

లోకంమీద విరుచుకుపడ్డాను. నాలోని శక్తులన్నీ బయటకు పెల్లుబికినాయి. ఆలోచన దానంతట అదే ఆగిపోయింది. మాటగారితనం వచ్చింది. చెమటలోడ్చి పని చేసినా మనసు ఉస్సురనదు, అర్ధరాత్రివేళ లేచి పుస్తకాలు ముందేసుకుని కూర్చోవటం సరదా అయింది. చిన్నప్పటి కార్యకలాపాలన్నీ ఆచరణలోకి వచ్చాయి గత స్మృతులు వికారంగా వున్నాయి. భార్య గుర్తుకు వచ్చినప్పుడు "వెర్రిది" అన్న నిర్లక్ష్యం కలిగేది. రకరకాల స్నేహితులు ఏర్పడ్డారు. అందంగా, ఆరోగ్యంగా వుండసాగాను. పరిస్థితులంటూ వేటిని చూసి నేను ఝడిశానో - వాటిని ఒక్కతాపు తన్నాను. రోజుకు ఎన్ని వందల రకాలుగా మాట్లాడినా అలసిపోవటంలేదు. ఎప్పటికప్పుడు మర్చిపోవటం కష్టమనిపించటంలేదు. భావయుక్తంగా నవ్వడం అబ్బింది. ఎప్పుడైనా ఒంటరిగా అలా షికారు పోతు

న్నప్పుడు గర్వంతో, ఆనందంతో శరీరం పొంగుతున్నట్లుండేది. ఇతరులమీద జాలి తల్చాలని వుండేది. నాకు నేను అర్థం కాకూడదనిపించేది. క్లబ్బుల్లో నేను, బిలియర్డ్స్ ఆడుతూ నేను, సమావేశాల్లో నేను, పుస్తకాల సారాన్ని పీల్చివేస్తూ నేను, గాఢ నిద్రలో నేను, అమిత ఏకాగ్రతలో నేను వూళ్ళు తిరుగుతూ నేను, రకరకాల వ్యాపారకాలలో నేను, నాకేకాదు ఎవరికీ అర్థంకాని నేను.

సరిగ్గా ఆరేళ్ళ తర్వాత మళ్ళీ ఆ గ్రామానికి పోవటం తటస్థించింది. స్నేహితుడు నన్ను కౌగలించుకున్నాడు. అతని పిల్లలందరికి ఖరీదైన బహుమతులిచ్చాను. ఎవరికీ యివ్వని బహుమానం ఒకటి వుంది. అది తీసుకుని ఉల్లాసంగా సాయంత్రం కొండమీదకు షికారు పోయాను. సరిగ్గా ఒకనాడు నిల్చున్నట్టుగా శిఖరంమీద నిల్చున్నాను. అస్తమిస్తోన్న సూర్యబింబం మనోహరంగా మండుతోంది.

ఏదీ? రాదేం? నాలో ఆశాజ్యోతి వెలిగించిన ఆ యువతి, చిరునవ్వు తప్ప అన్యమెరుగని పడతి, ఆ చండి రాదేం?

ఓసారి క్రిందకి చూశాను, అందమైన నది భయంకరంగా ప్రవహిస్తోంది. భయం మరచిన నాకు భయం కలిగింది. కొంచం వెనక్కి జరిగి నిలబడ్డాను.

క్రమంగా చీకటిపడింది. ఏం లాభం? నా ఆశ నిరాశగా మారింది. జాగ్రత్తగా క్రిందికి దిగివచ్చాను.

ఆ రాత్రి మెల్లగా స్నేహితుడ్ని కదిపాను. బిగ్గరగా నవ్వి "ఓహో! ఇంకే మరచిపోలేదా? ఆడవాళ్ళు ఎల్లప్పుడూ

యిక్కడే వుంటారా? పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయింది. అన్నాడు. అది అతని వ్యక్తిత్వం.

"ఎక్కడికి?"

"ఏమో! ఎంతమంది ఆడపిల్లలు ఎక్కడకు పోయినారో!" అని యీసారి వీపు చరిచాడు.

ఆశ్చర్యం! ఇన్నాళ్ళూ ఆమెకు పెళ్ళయి వుంటుందని నాకెందుకు తట్టలేదు? ఆమె తండ్రిని కనుక్కుంటే ఆమె ఉనికిని గురించి తెలియకపోదు. కాని సభ్యతగా వుండదు. ఆమెని కలుసుకోవాలన్న కోరిక నాలోనే యిముడ్చుకుని ఊరుకున్నాను.

అంత ఖరీదుపెట్టి తెచ్చిన బహుమతి ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఇహ ఆమెని కలుసుకునే ఆశకూడా లేదు. బరువు గుండెలో స్నేహితుడి దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాను.

ఇది జరిగిన ఏడాదిన్నరకు ఒకసారి కారు డ్రైవ్ చేసుకుంటూ బజారుగుండా వస్తున్నాను. ఒకచోట జనం గుమిగూడి వున్నారు. సంగతేమిటో తెలుసుకుందామని కారు దిగి చూశాను. ఎవరో ఆత్మహత్య చేసుకున్నారు. లారీక్రింద కావాలని పడి శరీరమంతా తుత్తునిలయింది. స్త్రీ? ముఖం మాత్రం రూపం చెడలేదు. పరిశీలించి చూసేసరికి ఒక్కసారిగా గుండె ఆగినంత పనయ్యింది. అదే యువతి! ఆమెని గురించి తెలిసిన ఎవరో వ్యక్తి ఆమె పడిన కష్టాలని గురించి యితరులకి హృదయ విదారకంగా చెబుతున్నాడు. అటువంటి బాధలు పగవాళ్ళకి కూడా వద్దంటున్నాడు.

ఇంతలో గుబురుగా గడ్డం పెరిగివున్న మోటు మనిషి ఒకడు లోపలకు త్రోసుకొనివచ్చి, అంతా చూసి "పీడ వదిలి పోయింది. చావవే చావు. ముదనష్టపుదానా అని అక్కడ్నుంచి వెళ్ళిపోబోతూంటే పోలీసులు ఆపటం కళ్ళబడింది.

నాకు ఎందుకో ఆమె పాదాలు కళ్ళకు అద్దుకోవాలన్నంత ఆప్యాయత పెల్లుబుకింది. తోసుకుని ముందుకుపోయి మోకాళ్ళమీద వొంగాను, కాని ఆమె పాదాల ఆకృతి ఎక్కడా కనబడలేదు.

జీవితం మనిషిని ఎట్లా దగా చేస్తుంది? ఎట్లా గారడీ చేస్తుంది? ఎప్పుడూ ఒకరు ఒకరుగా వుండలేరా? ఉండనివ్వదా లోకం? పోనీ - విధి అంటారే అది.

ఇంటికివచ్చి బీరువా తలుపులు తెరచి చూశాను. ఆమె కోసం కొన్న ఖరీదైన బహుమతి ధగధగ మెరిసిపోతూ అందులో వుంది. ఏడున్నర వళ్ళకి ఇప్పుడు మళ్ళీ ఒక్కసారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

—o—